# ఒక హత్య మరొక ఆత్మహత్య

"మనిద్దరం ఇలాగే... ఒకేసారి కలిసి చచ్చిపోతే ఎంత బాగుంటుంది?" ఆ తొలిఝాము వేళ అతని కళ్ళు విచ్చుకున్నట్టుగానే ఆవాళ్టికదే మొదటి మాటై గొంతు వీడిందేమో, ఆ గొంతు బొంగురుగానూ ముద్దముద్దగానూ వుంది. ఆమెకా గొంతులో తీవ్రమైన తపన కన్నా... తన్మయత్వం కన్నా... తపోదీక్షలో వుండి జపిస్తున్న మాటలానే వినిపించింది. ఆరు మాసాలుగా అలవాటుగా పునశ్చరిస్తున్న జపంలోని ప్రేలాపనలానే అనిపించింది.

అదేమాటని ఏడాది క్రితమైతే - పెళ్ళయిన తొలి దినాల్లోనయితే ఆమె 'మనిద్దరం ఇలాగే కలిసి జీవితాంతం బతికితే ఎంత బాగుంటుంది?!' అని సవరించి, మరింతగా గాలికి కూడా ఇంత రవ్వంత చోటునివ్వక కావలించుకునేది.

ఇప్పుడామె శరీరం కదలికకు పూనుకోలేదు. అతగాడి తల మాత్రం ఆమె గుండెల మధ్య పులుముకుంటూ మరింత చోటుచేసుకుంటూ చొరబడే ప్రయత్నం చేసి ఆగింది. ఫేను గాలి అలుపూ సొలుపూ లేకుండా వాళ్ళ నగ్న దేహాల మీద చల్లగాలి దుప్పట్లు కప్పే ప్రయత్నం చేస్తూ వుంది.

వెలుతురు వాకిళ్ళు తెరవని ఆ గదిలో బెడ్ లాంప్ వెలుగు చీకటి సామ్రాజ్యాన్ని చాలావరకూ తరిమేసినట్టుంది. ఆమె తెరిచిన కళ్ళకు నల్లని అతడి జుట్టు అగుపించింది. అతని తల మీద చెయ్యి వేసింది. పాతికేళ్ళకే జుట్టు పలచబడింది. మేఘాల మాటున 'చందమామ'ని పోలిక చేస్తూ గుర్తుచేద్దామనుకుంది. కాని ఎందుకనో ఏదీ అడ్డురాకుండానే గొంతు మూగబోయింది.

బయటెక్కడో కాకుల చప్పుడు, ఎందుకో వినపడని కోడికూత ఆమెకు గుర్తుకు వచ్చింది. తెలతెల వారుతున్నట్టుగానే తోచింది.

భరించరాని నిశ్శబ్దం............

భళ్ళున బద్దలైంది...........

అతను చిన్నపిల్లాడి మళ్ళే ఏడుస్తున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. రొమ్ముల్ని తడిపే చల్లని కన్నీటి స్పర్శ................

"...అర..రే.. చంటీ...... ఏంటమ్మా... ఏడవ కూడదు... నవ్వుతూ లేవాలి. నవ్వుతూ లేస్తే రోజంతా నవ్వుతూ గడుస్తుంది. నవ్వుతూ బతకాలి..." చేతనైనంత లాలిత్యంతో ముద్దు చేసింది. చేతుల్తో జుట్టుపట్టుకొని బలంగా అతని ముఖాన్ని ఎత్తి, నుదుటి మీద, తలమీద ముద్దులు పెట్టింది.

"ఏడుస్తూ పుట్టే మనిషి ఏడుస్తూనే బతుకుతాడు. నవ్వుతూ నిద్ర లేస్తే మటుకు నవ్వు ఎక్కడ్నుంచి వస్తుంది. పుట్టుకతో తోడై వచ్చింది ఏడుపు కాని నవ్వు కాదు...."

"మరి నీ పుట్టుకతో నేను తోడు రానంత మాత్రాన ..... తోడై నడవడంలేదా....."

ఆమె నవ్వింది.

ఆ నవ్వు ఆ గది నాలుగు గోడల మధ్యన ఇమడలేక ప్రతిధ్వనిస్తోంది.

"నువ్వూ... నవ్వూ తోడుగా వుంటాయని ఒప్పేసుకో..." మాటల్నీ నవ్వుల్నీ కలిపి కదిలిపోతూ వుందామె.

అతగాడి కళ్ళలో నీటి తెర ఇంకిపోతూ ఎర్రదనం చోటుచేసుకుంది. ముఖం రక్త ప్రసరణ జరగనట్టు కందగడ్డలా అయిపోయింది.

"ఏంటిరా దుంప ముఖం నవ్వూనూ..." చనువుగా తిట్టింది ఆమె.

ఆమె నవ్వుని ఆపే శక్తి ఆమె పెదాలకు లేనట్టే వుంది.

గలగలా పారుతోంది నవ్వు...

"నువ్వు నోర్మూయ్యి..." విసురుగా లేచాడతడు.

నవ్వు తెగి ఆగిపోయింది.

ఒకే ఒక్క క్షణం నిశ్శబ్దం... మళ్ళీ నవ్వుని అందుకున్నట్టే అలారం మ్రోగుతోంది. అతగాడికయితే అలారం మోత ఆగని ఆమె నవ్వులానే భరించనలవి కాకుండా వుండీ, దిగ్గున లేచి టేబుల్ మీది గడియారాన్ని ఒక్క తోపుతో నేల మీదకు నెట్టాడు. ఆమె నవ్వులానే అలారం ఆగనిదే..

"నీ నవ్వులతో నారు మళ్ళు పండించుకు బతికేయొచ్చమ్మా ఆ వచ్చిన వాడెవడో గాని..." వరాలత్త నాన్నతో అన్నమాట అప్పుడు యాదికొచ్చిందామెకు.

అలారమూ ఆమెలానే నవ్వలేనట్టు కొట్టుకుంటూ ఆగింది.

"నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు. నిజమే నిన్ను కట్టుకున్న దగ్గర్నుంచి నేను నేను కాకుండా పోయాను. నా బతుకు నాది కాకుండా పోయింది..."

"అవును ఇపుడు నీ బతుకు నాది..."కిసుక్కున నవ్విందామె.

"ఛీ..."

ఆ ఒక్క ఛీత్కారమూ మళ్ళీ ఆ గది వాతావరణాన్ని మార్చేసింది.

"వయస్సొచ్చింది, జ్ఞానం రాలేదు. అందుకే నీకు భర్తంటే గౌరవం లేదు. భక్తి లేదు. భయం లేదు. అర్థం చేసుకోవడమసలే లేదు...."

అతగాడలా తల పట్టుకు కూర్చున్నాడు. చేతులు పీకాయేమో చేతులు దించి, కాళ్ళు చాపాడు. ఒక కాలిని మడిచాడు. నగ్నంగా వున్నాడేమో ఆ భంగిమలో ఆమె కళ్ళలో ఏదో తళుక్కున మెరిసి నవ్వు తీగలై ఆ గది అల్లుకోజూసింది.

"ఎందుకలా నవ్వుతావ్ పిచ్చిదాన్లా?"

"మిమ్మల్ని చూస్తే యోగి వేమన గుర్తొచ్చి..."

ఆమె నవ్వుని కాక, పక్కనే వున్న జీవంలేని లుంగీని చుట్టుకున్నాడతగాడు. ఆమె ఇంకా నవ్వుల ప్రకంపనల్లోంచి బయటపడలేదన్నట్టు ఆమె శరీరం కంపిస్తూనే వుంది. జడపాయల్లోంచి జారి వీడిన కురులు రేగుతూ ఆమెభుజం మీదుగా పడి, ఆమె ఎడమ పక్క రొమ్ముని అస్పష్టంగానైనా కప్పుతూ వుంది.

క్షణకాలం కన్నార్పకుండా ఆమెని అలాగే చూసిన అతగాడు ఎంతో ఆబగానూ ఆతృతతోనూ ఆమెని చుట్టేసి ఒళ్ళంతా ముద్దులు పెట్టాడు. పాసినోటి వాసన పలుచనవుతూ వుంది. తడిలేని పెదవులు పొడిపొడిగానే ఒళ్ళంతా ముద్దర్లేసి వచ్చాయి. ఆనక అలసినట్టు పెద్ద ఊపిరి తీసుకున్నా అది నిట్టూర్పులానే వుంది.

"నువ్వు నా ప్రాణం ... నవ్వంటే నాకెంతిష్టమో... ఎన్ని ముద్దులిచ్చానో...?!"

"ఊ... ఎన్నంటే... సెకనుకో ముద్దు చొప్పున్నయితే రోజుకి ఎనభై ఆరువేల నాలుగు వందల ముద్దులు పెట్టొచ్చు...."

ఆమె లెక్కల సమాధానం అతగాడికి చిరాకు తెప్పించింది. దిగమింగుకుంటూ...

"భార్యాభర్తలన్నాక కలిసి బతకాలి... కలిసి చావాలి... ప్చ్ ... నీ కివన్నీ అర్థం కావు" ఆమె మౌనం అతగాడి చిరాకుని రెట్టింపు చేసింది. అణచిపెట్టుకుంటూ...

"మనుషులుగా మనం చచ్చిపోయినా... మన ప్రేమ బతుకుతుంది".

ఆమె కన్రెప్పయినా కదలనితనం అతగాడి కోపాన్ని రాజేసింది. అగ్గి అంటుకున్నాక - "నేనేమయినా ఏకపాత్రాభినయనం చేస్తున్నానా?"

అతని గొంతుకు ఆమె బెదరకపోగ, 'ఏమో?' అన్నట్టు రెండు 'భుజాలు ఎత్తి, పై పెదవిని కదల్చకుండా కింది పెదవి విరిచింది.

అతగాడు తట్టుకోలేని తనంతో ఆమె మీద పడి కళ్ళలో కళ్ళు కలుపుతూ ... ఒకరి శ్వాస ఒకరు పీల్చక తప్పని స్థితిలో ముఖాన్ని పెడుతూ .. కసిగా...

"మనిద్దరం కలిసి చచ్చిపోదాం...."

"సినిమాల్లో తప్ప ఇద్దరూ ఒకేసారి ఒకే నిముషాన చనిపోవడం జరుగుతుందా?"

ఆమె మాట తీరు అతగాడ్ని వెర్రివాడి కింద జమకట్టేదిలా తోచింది. ఆమె పెదవి దాయని నవ్వు నిజంగానే పిచ్చివాడ్ని చేస్తోంది. ఒక ఉన్మాదంతో....

"ఆ వెటకారమే వద్దు... నే భరించలేను.. నిన్ను చంపేస్తాను..."

ఆమె గొంతుని అతగాడి అరచేతులు రెండూ బిగిసి పట్టుకున్నాయి. కళ్ళలోని నిప్పులు నరాల వెంట చేతివేళ్ళదాక పాకుతున్నాయి.

"ఇలా అయినా నే ముందు చచ్చిపోతాను. మరి ఇద్దరం ఒకేసారి?"

ఆమె ముఖంలో నవ్వు లేదు. కాని ఆమె మాటల మెరుపు కళ్ళలో ప్రతిఫలించి అతగాడి చూపుని బెదరగొడుతోంది. మెరుపుని దర్శించలేని కళ్ళతో చేతుల్ని కూడా ఆమె కంఠం మీది నుంచి వెనక్కి తీసుకున్నాడు.

"చూసావా, ఇంత జరిగినా కలిసి ఒకే సారి బతికి వున్నాం..."

ఆమె గొంతులోని దగ్గు సర్దుకొని కోయిల స్వరాన్ని జ్ఞాపకం చేసేలా వుంది.

"నాకు చావాలని వుంది"

"నాకు చావాలని వుంది"

"నాకు చావాలని వుంది"

అతని గొంతు కీచుగా వుంది. అతని చూపు కాంతిని దర్శించలేని కళ్ళకుమల్లే ఎటూ సారించలేదు. ఆమె ఒక్క క్షణం అతన్ని చూసి ఏదో ధ్యాసలో పడినట్లుంది.

"ఎన్ని రోజుల్నుంచో చెపుతున్నా, ఈ దఫా వాయిదా వెయ్యొద్దు...."

ఆమె జవాబు కోసం ఎదురుచూడకుండానే మళ్ళా అన్నాడు.

"అందుకే ఈవాళే మనం అరకు వెళ్తున్నాం..."

ఆమె కనిపించని ఉలికిపాటుకు గురైనట్టు ఆమె కనుగుడ్లు నిలిచిపోయాయి.

అతను అదే మాటని మళ్ళీ రిపీట్ చేసాడు. అతని గొంతు కీచుగనే కాదు, కీచురాళ్ళ రొదలా వుంది. ఎప్పట్నుంచో ఇప్పుడూ అదే మాట. అదే రొద. కీచురాళ్ళ రొద.

"చావడానికి అరకెందుకు?" ఆమె పెదవి విడకముందే...

"గుట్టు... పరువు..." ఇంకేదో అతను చెప్పాలనుకుంటూండగా...

"మనం చచ్చాక పరువు వుంటే ఎంత? పోతే ఎంత?" ఆమె మళ్ళీ అంది.

"నీకు చెప్పలేను.... కనీసం ప్రశాంతంగా చద్దామని"

అతని గొంతు ఉక్రోషాన్ని పట్టలేనట్టే వుంది, వుమ్మి తుంపర్లు మాత్రం బయటకు దూకేసాయి.

ఆమె యింక నోరు విప్పలేదు.

తెలతెలవారుతోంది గదా, వీధి చివర గుడిలోంచి మైకు మోసుకొస్తున్న పాట .... భగవద్గీత....

"... చంపెడి వాడవు నీవా... చంపబడెడివాడు వాడా?

చేసెడివాడను నేనే!.... చేయించెడివాడను నేనే!!"

పాటని వినమన్నట్టు చెవులు రిక్కించి, కనుగుడ్లు నిలేసాడతడు. ఆమె అతని చేష్టల్ని గమనించి గమనించనట్టే వూరుకుంది.

పాల పేకెట్టేమో తలుపుని తట్టి వూరుకుంది.

అంతలోనే అతగాడికేదో గుర్తుకు వచ్చినట్టు లేచి వెళ్ళి, స్నానమాడి వచ్చాడు. కొత్త దుస్తులతో నీటుగా ముస్తాబయాడు. ఇంకా పక్క మీంచి లేవని ఆమెని చూసి పొడి దగ్గు దగ్గాడు. టైం అవుతున్నట్టు చేతి వాచీని చూసుకున్నాడు.

ఆమె అస్తవ్యస్తంగా, కప్పుకున్న చీరతో పోగులా పడివుంది.

"అరకు ట్రైను మిస్సవుతాం" హానీమూన్ మిస్సవుతామన్నట్టు చెప్పేడు.

"కారులో వద్దు. ట్రైనులోనయితే కిటికీ దగ్గర కూర్చొని ఎంచక్క లోతైన లోయ మీద విమాన ప్రయాణం పోతున్నట్టు హాయిగ వుంటుంది".... తొలిసారి అరకు వెళ్దామని అతగాడన్నప్పుడు అసలు విషయం తెలియని ఆమె కోరిన కోరిక ఇప్పుడామెకే గుర్తుకు వచ్చింది.

"నిన్నే..." అతగాడాగేలా లేడు. వున్నచోట నిలబడలేక ఆమె దగ్గరగా వచ్చి మృదువుగా ఆమె కురుల్ని సవరించాడు. అసహనంగా తన తల గోక్కున్నాడు. ఆమె వున్న మంచం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేసాడు. ఆగక, తలుపు తీసి ద్వారం దగ్గరే పడి వున్న పాల పాకెట్టుని తెచ్చి టీ చేసి కప్పుతో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు.

"ప్రేమతో కలిపా"... వినయంగా అందించాడతడు.

"విషంతో కలిపా" అన్నట్టు ఆమెకి వినిపించలేదు, అతడలా అన్నట్టుగా అనిపించింది.

ఆమె కప్పందుకొని తాగుతూ వుంటే.....

"నాక్కొంచెం వుంచు"...

అతడి మాటతో మరో గుక్క మింగి ఇచ్చింది. ఆమె పెదాలు తాకిన చోటే ఎంగిలి మీదే తన పెదాలు ఆన్చి 'అమృతంలా వుంది' అన్నాడు.

"కడుపులో పాములైపోతాయి..."

ఆమె లేచి వెళ్ళి కాలకృత్యాలూ, స్నానపానాలు ముగించుకొచ్చి ముందు నిలబడింది. అప్పటికే అతగాడు జిప్ బేగ్ భుజానికి వేళాడుతుండగా నిల్చున్నాడు.

కాసేపటికి గదికి తాళం పడింది.

"ఈ రాత్రికి ఇంట్లో దొంగలు పడ్డా మనం బాధపడం కదూ?" ఆమె నవ్వింది.

అలజడితో వున్న అతగాడికి ఆమె ఆకతాయితనం అంతుపట్టలేదు. ఆపైన నోరు విప్పలేదు.

రైల్లో కూచున్నాక...

"ట్రైను ఆక్సిడెంటయితే మనకు శ్రముండదు కదూ?" మళ్ళీ ఆమె నవ్వింది.

అతను నవ్వనూ లేదు, మాట్లాడనూ లేదు.

"మీ ఒక్కరి కోసం... సారీ మనిద్దరి కోసం .... అందరి చావుని... ట్రైన్ ఆక్సిడెంట్‌ని కోరుకోవడం తప్పు కదూ?" ఆమె అతని చెవిలో చెప్పిన మాట వెన్నును తాకింది.

అతను ఎడంగా జరిగాడు.

"కొత్త పెళ్ళికొడుకులా సిగ్గుపడతారేం?, అంతా చూస్తున్నారనా? రేపు పేపర్లో ఎలాగూ చూస్తారుగా..."

అతడు ఏమీ అనలేక పెదాలు కొరుక్కున్నాడు.

విశాఖపట్నంలో కొంత ఖాళీగా వున్నా సింహాచలం నుండి కొత్తవలస స్టేషన్ల మధ్య జనం బాగా ఎక్కారు. బోగి కిటకిటలాడుతూ వుంది. కిటికీల కోసం పిల్లలూ, పెద్దవాళ్ళూ దెబ్బలాడుకుంటున్నారు.

"మనిద్దరికీ ఒకే కిటికీ"

ఆమె కిటికీ పక్క కూర్చుంది, ఆమె పక్కన అతడు. మరో రెండు పెద్ద కుటుంబాల వారెవరో లెక్కకు మిక్కి పక్కన, ఎదురుగా ఇరుకిరుగ్గా కూర్చున్నారు. అతడు ఆమెకు దగ్గరగా జరక్కతప్పలేదు. ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వుని అతడు అందుకోకపోగా ఎదురుగా వున్న నడివయసావిడ అందుకుంది.

''మీరూ అరకు చూడ్డానికేనామ్మా?''

''లేదు...'' అని ఆమె అతడి వంక చూసింది.

''...కాదు.. చుట్టాలున్నరని...అయినా అరకు చూద్దాం...'' అతడు ఆమెకు చెప్పాడో నడివయసావిడకు చెప్పడో అర్థం కాలేదు చూసేవాళ్ళకి.

''ఇదిగో మా తమ్ముడికి కొత్త గా పెళ్ళయింది. అరకు పెళ్ళి కొడుక్కీ, పెళ్ళి కూతురుకీ కొత్తని మేం బయలు దేరాం, ఒకరూ ఒకరూ చేరి మటాలమయిపోయింది'' నడివయసావిడ తమ పటాలన్ని తృప్తిగా చూసింది.

కొత్త జంట సిగ్గుపడుతూనే అందరి మధ్య ఒకరి మీదకొకరు ఒరిగిపోతూ మెలికలు తిరిగిపోతున్నారు.

''ఎంత కట్నం?'' ఇంకొకామె ఉత్సుకతని పట్టలేక వెంటనే అడిగింది.

''అమ్మాయి డిగ్రీ చదివినా రెండు లక్షల కట్నం...'' అమ్మ నొచ్చుకోవడం ఆమెకు యాదికొచ్చింది.

''మీ తమ్ముడేం చేస్తాడు?'' ఆవిడే మళ్ళీ అడిగింది.

''పోయిన రెండు లక్షలు పోయినా అబ్బాయి స్టీల్ ప్లాంట్‌లో ఇంజనీరు...'' నాన్న అమ్మని తృప్తిపడమన్నట్టు చెప్పిన మాటని దీర్ఘం తీయడం ఏనాటికి ఆమె మరిచిపోదు. అందుకనే ఆ ప్రశ్నలకన్నీ తన జీవితపు జవాబులు తలపుకొస్తున్నాయి.

''పదేళ్ళ క్రితం వరకూ గుడ్డిదో నడ్డిదో గవర్నమెంట్ ఉద్యోగం వుంటే కళ్ళకద్దుకొని పిల్లనిచ్చేసేవాళ్ళం, ఇప్పుడు ఉద్యోగస్తుడికి ఇవ్వడమన్నా భయంగా వుంది. నా ఆఖరి కూతురు గొంతలాగే కోస్తాను...'' చివరన కూర్చున్న ముసలాయన దిగులుపడుతూ అన్నాడు.

''ఉద్యోగస్తులకేముంది!? రైతా? ఎండా, వానా, పంట చేతికొస్తుందో రాదోదని బెంగ. ఫస్టు తారీఖుకి టంచనుగా...'' ఎవరో కూలి మనిషి రైత రకం నుండి జారిపడ్డాడేమో లేవలేనంత భారంగా వున్నాయి అతని మాటలు కూడా.

''అది పాత వుద్యోగస్తుల కాలం, ఇప్పుడంతా రకరకాల స్కీములు. వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ కాదంటే కంపల్సరీ రిటైర్‌మెంట్... మా నాన్నలకు ఉద్యోగాలివ్వండని చిన్న పిల్లలు ధర్నాలు చేస్తున్నారు...'' ముసలాయన కళ్ళలో నీళ్ళు తిరిగి, మాట పెగల్లేదు.

''ఓడి ఇంజనీరుద్యోగం... దాంతో తృప్తి పడకనే బట్టల వ్యాపారం చేస్తూ ఫైనాన్స్ కంపెనీల్లో డబ్బులు పెడుతూ...'' ఆదర్శమూర్తిగా అభివర్ణించే అన్నయ్య మాట ఆమెకు తలపుకి వచ్చింది.

ముసలాయనెవరో సముదాయిస్తున్నారు. ఇప్పుడున్న గవర్నమెంటు వున్నంత కాలం ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడాల్సిందే కాని బతికి బట్టకట్టేది లేదని, ఛైర్మన్ల కోసమే కార్పోరేషన్లని కుర్రవాడెవరో అంటూ వున్నాడు.

పిల్లలు ఇవేవి పట్టకుండా గోల గోల చేస్తున్నారు. మరోపక్క చిల్లరతిళ్ళ అమ్మకపు వ్యాపారుల అరుపులు.

రైలు శృంగవరపు కోటను దాటిందేమో కొండల మీదకు ఎగబ్రాకడం మొదలు పెట్టింది. అలా ఎగబ్రాకడం ఆమెకు స్పర్శలో కొచ్చింది.

"మా వాడికి ఏ వ్యసనమూ లేదు...."

"పిల్ల సుఖపడుతుంది..."

అవి రైల్లో మాటలో గతంలోని మాటలో ఆమెకు తేడా తెలియనట్టే వుంది.

అతడు వుండీ వుండీ చిన్న కునుకు తీస్తూ కళ్ళు తెరుస్తూ వున్నాడు.

ఆవలి పక్క నుంచి బూతులు వినిపిస్తున్నాయి.

".... బెనిఫిట్ స్కీమని ఫ్రిజ్‌కీ వీసీపికి పదివేలు కట్టాం. పట్టుకు దొబ్బేసాడు. దొబ్బేడా... ఈ దరిద్రురాలు చేసింది... వుంటాడో పట్టుకు పోతాడోనని అనుమానం పెట్టేసింది. దాంతో తేల్చుకోలేక ఆలస్యమైపోయాను. అందరికీ సగం రేటుకే ఇస్తున్నారు కదా అని ఆలస్యంగా నైనా నమ్మికట్టాను. లంజాకొడుకు రాత్రికి రాత్రి ఎత్తేసాడు..." అమ్మో ఆలీ చేసిన తిట్లు...

"అలాంటివి మొదటి పదిహేన్రోజుల్లోనే కట్టాలి. డబ్బులన్నీ కలక్టను చేసుకోవడానికి మొదట్లో అడిగినవన్నీ ఇచ్చేస్తాడు. ఆలస్యం చేస్తారు. మీదే తప్పు" ఎవరో అనునయిస్తున్నారు.

"మా ఆవిడదే తప్పు... దరిద్ర గొట్టు లంజ తయారయింది నా పీక మీదకి..."

"ఇప్పుడు నేనేం చేసేది" ఆడగొంతు.

"మీ పుట్టింటికి పోయి తీసుకురా..."

తిట్లు... ఏడుపులు... శాపనార్థాలు... వెరసి వీరంగం!

అతగాడికి కునుకు వదిలిపోయింది, ఆ గొడవకీ తనకీ సంబంధమున్నట్టు ఉలిక్కిపడి నిటారుగా కూర్చున్నాడు. ఆమె కళ్ళతో కళ్ళు కలిపాడు.

"నిన్ను కన్నాం పెంచాం... పెద్ద చేసాం.. చదివించాం... ఉద్యోగస్తున్ని చేసి పెళ్ళి చేసాం. కట్నం డబ్బులు మావి... అది లోక రివాజు"

" నా ఖర్చుల ఖాతా నువ్వు చెప్పిన వాటికి రెండు లక్షలా? ఇది వ్యాపారమా?"

"నువ్వేం చేస్తావ్ ఆ రెండులక్షలూ?"

''అల్రెడీ ఫైనాన్స్‌లో లక్ష, బట్టలు పంపమని మిల్లులకి లక్ష కట్టేసాను...''

''వ్యాపారం చేస్తున్నావన్న మాట...''

'' నా వ్యాపారం నేను చేసుకుంటున్నాను...''

''మే మేం కావాలి...''

''మేం మీలా కాకూడదు... స్టేటస్ లేని బతుకులు మీలా మేమూ బతక్కూడదు. ముప్పై మూడేళ్ళ సర్వీసు చేసి రిటైరయి ఏం సంపాదించారు? కలర్ టీవి, వీసిఆర్, ఫ్రిజ్, ఎయిర్‌కూలర్ కనీసమైన... మినిమమ్ కంఫర్ట్ లేకపోతే లైఫ్‌నేం ఎంజాయి చెయ్యాలి.... ఇక్కడ తోటి వాళ్ళలో గౌరవం ఎలా వస్తుంది....?''

''నేను గౌరవంగానే బతికాను...''

''సింగిల్ బెడ్ రూం ఇల్లయినా కట్టించావా? నే డబుల్ బెడ్ రూం హౌస్ కోసం ఫ్లాటు కొన్నాను. నా సర్వీసు మూడేళ్ళు... ఇంకా ముప్పై ఏళ్ళుంది...''

ఒక్కసారిగా పిల్లల అరుపులు, కలిసిన కళ్ళ మధ్య దృశ్యం చెదిరిపోయింది. చీకటయిపోయింది. చీకటి సొరంగాల్లోంచి రెండు క్షణాల్లో రైలు బయటపడింది.

ఎవరో వంటి మీది వస్తువుల్ని తడుముకుంటున్నారు.

పిల్లలు చీకటి సొరంగాల్ని లెక్క పెడుతూ 'ఒకటి' అంటున్నారు.

రైలు ఆఖరి పెట్టెల్లో వున్నారేమో... వంపు తిరగినచోట రైలంతా మెలికలు తిరుగుతూ కీ ఇచ్చినట్టు పారిపోవడం ఆమె కళ్ళకి వింతగానే తోచింది.

అతగాడు ఆవలింతలు తీస్తున్నాడు.

ఇంతలోనే వంకర రైలుని ఎవరో సాగదీస్తున్నట్టు తిన్నగయిపోయింది.

''వేరుశనక్కాయలే... వేపిన శెనక్కాయలే..''

'టైంపాస్' అంటూ అతగాడు వేరుశెనక్కాయలు కొని, పొట్లాం ఆమె చేతిలో పెట్టాడు. కొంత మలుపు తిరగే లోపల పొట్లాం ఖాళీ అయిపోయింది.

'అయిదు' సొరంగాల లెక్క సాగుతూ ఉంది.

ఆమె చేతులు దులుపుకుంటూ పొట్లాం కాగితాన్ని వుండచుట్టి కిటికీలోంచి పారెయ్యబోయింది. అతగాడి దృష్టి ఆ నలిగిన వుండ మీదనే వుందేమో టక్కున ఆమె చేతిలోంచి అందుకున్నాడు.

నలిగిన కాగితాన్ని విప్పి సరిచేయడంతో ఆమె కూడా ఏమిటన్నట్టుగా చూపు నిలిపింది. కాగితం చిరిగి వుండడం మూలాన కంపెనీ పేరు లేదు గాని ఫైనాన్స్‌కు సంబంధించిన అడ్వర్‌టైజ్‌మెంట్‌లా వుంది.

ఆతృతగా అతగాడు చదవడం ఆమె దృష్టిని దాటిపోలేదు.

ఆ కాగితాన్ని తిప్పి వెనకవైపు చూసాడు. 'ప్రజలనెత్తిన శఠగోపం పెట్టిన మరో ఫైనాన్స్ కంపెనీ' వార్త!

ఇద్దరూ కలిసే చదువుకున్నారు.

ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు.

"తాళాలు బద్దలు కొట్టండి... దొరికితే తలలు బద్దలు కొట్టండి... బ్రాంచి మేనేజరు ... ఫైనాన్స్ మేనేజరూ... కరస్పాండెంట్ ... అందరూ జెండా ఎత్తేసారు.... మేనేజింగ్ డైరెక్టర్ వారం రోజుల ముందే సర్దుకున్నాడు..."

"ప్యూన్ వున్నాడట పట్టుకోండి..."

"... ఇంకెక్కడ? వాణ్ని తన్ని జీవాలార్పేసారు. చావు బతుకుల్లో ఆసుపత్రిలో చేర్చారట... అదిగో పోలీసులొస్తున్నారు."

"... రానివ్వండి... వాళ్ళూ మనలాంటి బాధితులే.. మన కమీషనరూ సూపరింటెండెంట్.. సబ్ ఇన్స్పెక్టర్ల దాకా వాళ్ళూ కొద్దో గొప్పో వేసారు.. వడ్డీ రేటు ఎక్కువని అయ్యేయెస్ ఆఫీసర్లు కూడా పెట్టుబడులు పెట్టారు..."

"ఫైళ్ళే వున్నాయి.... పైసా వదల్లేదు..."

"ఈయనేమిటి ఇలా పడిపోయాడు? హార్ట్ ఎటాక్ వచ్చిందేమో?"

"రాదా... వున్నదంతా వూడ్చిపెట్టాడు"

'తొమ్మిది' పిల్లలు ఎక్కాలు చదివినట్టు ఒక్క సారిగా అరిచారు.

దృశ్యం చెదిరిపోయింది.

'పన్నెండు..'

'... పదిహేను' సారంగాల లెక్క సాగుతూ వుంది.

చేతిలోని కాగితం ఎగిరిపోయింది. కిటికీల్లోంచి ఎటుపోతోందో తెలీదు. ఏ లోయలోకి జారుతుందో.. ఏ చెట్టును చేరుతుందో.. ఎట్నుంచి... ఎటో...? అతగాడు ఆత్రంగా దాని చిరునామా కోసమని కళ్ళని నలుమూలలకు సారించాడు.

"చెయ్యి జారాక మళ్ళీ చేతికొస్తుందా?" ఆమె అంది.

'ఫైనాన్స్‌లో పోయిన లక్ష గురించే కదా ఈమె అంటున్నది?' అనుమానంతో అతడు నొసలు చిట్లించాడు.

ఎవరో పిల్లాడు నలభై తొమ్మిది సొరంగాలని పిల్లలందరికీ చెప్పి, వెనుక నుంచి లెక్క పెడుతున్నాడు....

"ముప్పై నాలుగు... ముప్పై మూడు... ముప్పై రెండు....

చీకటి సొరంగాన్ని దాటితే ఒక్కో అంకె తగ్గిపోతూ వుంది.

పిల్లలంతా ఆసక్తిగా అటువేపే తిరిగి గొంతు కలిపారు.

"ఇరవైయ్యేడు... ఇరవయ్యారు.. ఇరవై అయిదు...

అతగాడూ ఆసక్తిగా అంకెల్ని అవరోహిస్తూ పెదవి దాటని గొంతుతో ఉచ్ఛరిస్తూ వున్నాడు.

ఒక చీకటి సొరంగం దాటితే ఒక రాత్రిని దాటినట్టు వుంది!

ఒక రోజు గడిచినట్టు వుంది!

"పద్దెనిమిది... పదహారు.. పన్నెండు..

'యూనిట్ ధర అరవై అయిదు నుండి అలా అలా ఆరోహణని ఆశిస్తే... అవరోహణ చేసుకుంటూ...' అతగాడి పెదాలు వణుకుతున్నాయి.

"తొమ్మిది ... ఎనిమిది ... ఏడు....

"ఛ్" అరిచాడు.

'షేర్ల ధర ఇలాగే పడిపోయింది కదూ?!' అనుమానంతో ఆమె నొసలు చిట్లించింది.

"..... మూడు... రెండు ....ఒకటి"

వెలుతురులోకి వచ్చినా అతగాడి కళ్ళకు చీకటిగానే వుంది.

ఆమె అతన్ని, పట్టించుకోకుండా ప్రకృతి సౌందర్యాన్ని వీక్షించడంలో లీనమైపోయింది.

ఎవ్వర్నీ పట్టించుకోకుండా రైలు పరుగులు తీస్తోంది.

"అయితే పెళ్ళికి బట్టలెక్కడ తీసారొదినా?" పెళ్ళి బృందంలో చర్చ ఈ దఫా బట్టల మీదికి పోయింది.

"ఆషాడమాసం సందర్భంగా ఆఫ్ రేటుకే, యాభై శాతం డిస్కౌంట్... అందరూ ఇచ్చారు, బొమ్మనాలోనా... చందనాలోనా?"

వాళ్ళ మాటలు ఆమెనీ అతగాడ్ని ఈడ్చి తీసుకువచ్చాయి.

"ఆషాడం పోయినా శ్రావణమాసం సందర్భంగా కూడా అదే రిబేటు".

"ప్రతీ మాసం ఏదో ఒకటి అంటారు, అయినా ఇలాంటప్పుడే తీసుకోవాలి..."

"గిఫ్ట్ కూపనూ వుందట..."

"పది గ్రాముల బంగారం... మారుతి... సన్నీ..."

అతగాడా వాతావరణంలో ఇమడలేనట్లు అసహనంగా కదిలాడు. లేచి నిల్చున్నాడు. కూర్చున్నాడు.

"విజయనగరంలో బట్టలు చౌకంటారా? ఆ పెద్ద షాపుల వాళ్ళు వచ్చాక, చిన్నా చితక అన్ని షాపుల వాళ్ళూ వూరి బయట కంటోన్మెంట్ దగ్గరకు పోయి అంతా కలసి హోల్‌సేల్ పెట్టుకున్నారు... ఎక్కడా పెద్ద షాపుల వాళ్ళ బ్రాంచీలే.. అవే..." వ్యాపారస్తుడొకాయన కలుగజేసుకు చెపుతున్నాడు.

బొర్రా స్టేషను వచ్చింది.

చాలామంది దిగిపోయారు. పెళ్ళి బృందం దిగి పోయింది. వాళ్ళు, అర్ధాంతరంగా వదలి వెళ్ళిన మాటలు ఇంకా అతడ్ని కెలుకుతూనే వున్నాయి.

రైలు కాస్త తేలికయి కదిలింది.

సీట్లు ఖాళీ అయి, అతగాడు అక్కణ్ణుంచి లేచి వెళ్ళి ఆమె ఎదురుగా పోయి కూర్చున్నాడు.

ఎవరో పరిచయస్తుడు అతన్ని పలుకరించాడు. అరకు తర్వాత స్టేషన్‌లో తన అన్నయ్య వున్నాడని, రైల్వేలో పని చేస్తున్నాడని, కలవడానికి వెళుతున్నానని చెప్పాడు. తన ప్రయాణం గురించి చెప్పాక...

"మీ బట్టల షాపు ఎత్తేసి నాలుగు నెలలయిందట, నాకు తెలీదు.. సారీ..." నొచ్చుకుంటున్న పరిచయస్తున్ని, అతని పిల్లలు కాబోలు కిటికీ దొరికిందని సంబరపడిపోతూ తీసుకెళ్ళారు పక్క పెట్టెలోకి.

అతగాడు భరించలేనితనాన్ని ఆమె పసిగట్టింది. లేచి వెళ్ళి అతని పక్కనే కూర్చుంది.

ఆకాశం నల్లగా మేఘాలెత్తి గుడగుడ కలియదిరుగుతోంది.

తడిచిపోతానన్నట్టు రైలు అరుచుకుంటూ వేగాన్ని పెంచింది.

ఆమెకు ఆకలి వేసింది.

అతగాడికి అదేమీ వున్నట్టు లేదు, ఈ లోకంలో వున్నట్టే లేడు.

"ఏమండీ.."

ఏమిటన్నట్టుగా చూసాడతడు.

'ఆకలంటే' - 'అర్థం చేసుకోవు, నీ బాధ నీదే'నని తిడతాడని, "చూడండి... ఈ లోయ చాలా లోతుగా వుంది కదూ..." కిటికీలోంచి చూస్తూ అడిగింది ఆమె.

ఔననీ కాదనీ అనలేదతడు.

"లోయలోకి దూకేద్దామా?"

ఆమె చిన్నగానే అడిగింది, అతడికదే గొంతు పెద్దగా అరచి చెప్పినట్టు వినిపించింది. చుట్టూ కలియజూసాడు. ఎవరూ వినలేదు కదా అన్నట్టు గుండె మీద చెయ్యి వేసుకున్నాడు. ఎవరి జ్ఞాపకాల్లో వాళ్ళున్నారు.

అతన్నుంచి ఏ సమాధానమూ రాక ఏమంటావ్ అన్నట్టుగా చూసిందామె.

"నువ్వు జోక్‌గా తీసుకుంటున్నావ్ కదూ?!" ఇప్పటికీ అతగాడు ఆమెని నమ్మనట్టే వుంది.

"ప్రామిస్..." అందామె.

ఆమె ముఖమ్మీది చిర్నవ్వు అతడి నమ్మకాన్ని చెదరగొడుతూ వుంది. అందుకనే మౌనంగా వున్నాడు. ఆమె పసిగట్టింది.

"పోని నే వెళ్ళి దూకెయ్యనా.." ఆమె తలుపు దగ్గరకు నడవబోయింది. అతను చెయ్యి పట్టి ఆపాడు.

"నాకు ధైర్యం చాలకపోతే ... కళ్ళు మూసుకుంటాను నన్ను తోసేయ్..." ఆమె చాలా నెమ్మదిగా అతడికి మాత్రమే వినిపించినట్టు చెప్పింది.

"నువ్వు అరకు చూస్తానన్నావుగా..." అతడన్నాడు.

"నీకు దూకడానికి భయమని చెప్పు"

ఆమె వెనక్కి వచ్చి కూర్చుంది. అతగాడు ఓడిపోయినట్టు తలదించుకుని ఆమె పక్కనే వచ్చి కూర్చున్నాడు.

చిన్నగా చినుకుల తుంపర... గాలితో పాటే లోపల కొచ్చి పడుతోంది. ఎవరెవరో కిటికీ తలుపులు మూస్తున్నారు.

ఆమె తడుస్తూనే లోయల్ని చూస్తోంది.

అందమైన అనుభూతుల మధ్య అరకు స్టేషన్ వచ్చింది. అందరితోపాటే అతడూ ఆమె దిగారు.

రైలు కూతతో వీడ్కోలు చెప్పి ప్రయాణం పూర్తి కానట్టు బయల్దేరింది.

వర్షం పెద్దదయింది.

'మనకి అరకు స్వాగతం పలుకుతోందన్నమాట' ఆమె.

అతడు బుద్ధిమంతుల్లా మాట్లాడలేదు. ఆమె వర్షంలో తడిచింది. అతను మాత్రం షెల్టర్ కిందే నిలుచున్నాడు.

గంట సేపు కురిసేకనే అలసిన వర్షం వెలిసింది.

రైల్వే వెయిటింగ్ రూమ్‌లో ఆమె బట్టలు మార్చుకు వచ్చింది. తడిబట్టలు పాలిథిన్ కవర్లో పెట్టి పట్టుకుంది.

స్టేషన్ నుంచి ఆటోలో అరకు వెళ్ళి లాడ్జీలో దిగారు.

వేడివేడి టీ, టిఫిన్ సేవించాక వాతావరణం ఆహ్లాదంలోకి వచ్చింది.

అప్పటికే సాయంత్రమైంది.

అరకులోని అందమైన స్థలాలు చూడడానికతడు బద్ధకించాడు. వర్షం సాకు చూపాడు. ఆమె పట్టువదల్లేదు.

వాటర్ పాల్స్ దూరమన్నాడు.

"నే మళ్ళీ తడుస్తానని భయమా? జ్వరమొచ్చినా ఒక్క రోజు శరీరం... ప్చ్... బయల్దేరు..." ఆమె బుంగమూతి పెట్టింది.

చివరకు పద్మావతి గార్డెన్స్‌కు బయలుదేరి వెళ్ళారు.

"పూలనీ ఆడవాళ్ళనీ పోల్చి చెపుతారెందుకని"

'సుకుమారమైనవ'ని అందామనుకున్నాడు కాని అన్లేదతడు.

"తన యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండా నలిగిపోతుందనేమో..." ఆమెకే నచ్చని ఆ వాక్యాన్ని 'కవిత్వమని' మెచ్చుకున్నాడతడు.

"పువ్వుల్ని కోయరాదు" బోర్డు.

"పువ్వుల్ని పోని సౌకుమార్యమైనవనుకున్నా - 'కోయడం' తప్పు పదం. కోయడమేమిటి? 'ఏరడమే' కరెక్టు" ఆమె మాటలను అతడు చర్చ చేయలేదు.

సమయం ఏడు కాకుండానే గార్డెన్ గేటు తలుపులు మూసేస్తూ, బయటకు నడవమని కేకలు వేస్తున్నారు.

ఇద్దరూ గేటు దాటి వచ్చారు.

ఆటోలో అరకు వూర్లోకి చేరుకున్నారు. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన గిరిజన సంస్కృతుల ఎగ్జిబిషన్ చూసారు. వారి జీవన విధానం ఆమెకి ఎంతగానో నచ్చింది. శిలువైపోయిన తమ జీవన సంస్కృతి ప్రదర్శనకు గిరిజన యువతులే కూలీలుగా వుండడం ఆమెను నొప్పించింది.

"మనుషుల్నీ, వారి సంస్కృతినీ నాశనం చేసి వాటి స్థానంలో మరబొమ్మల్ని పెడుతోంది. ప్రభుత్వం" ఆమె పైకే అంది.

అతడు టైమయిపోతోందన్నట్టుగా చేతి గడియారం చూసుకున్నాడు.

"వీళ్ళకి మనలా 'మినిమమ్ కంఫర్ట్స్' అవసరం లేదు, హాయిగా బతికేస్తారు"

ఆమె మాట అతడికి ఎక్కడో గుచ్చుకున్నట్టుగానే వుంది.

"అడవి మనుషులు..." అన్నాడు.

అతడి ఛీత్కారాన్ని ఆమె తట్టుకోలేక, తీక్షణంగా చూసి విసవిసా ముందుకు నడిచింది. అతడు ఆమెను అనుసరించాడు.

"మధ్యాహ్నం భోంచేయలేదు కదా? నాకే ఇంత ఆకలి వేస్తోంది, నీ కెంత ఆకలి వేస్తోందోనని...' భోజనానికి రమ్మంటూ ప్రాధేయపడ్డాడు.

ఆమె అతని వెంట నడిచింది.

హోటల్ చేరి, భోజనాలయ్యాక లాడ్జికి చేరుకున్నారు.

అంతకు ముందు కురిసిన వానవల్ల చలి రెట్టింపు అయింది. ఆమె చిన్నగా వణుకుతున్నట్టు పెదవులు కొట్టుకున్నాయి. అది చూసి అతడు 'వర్షంలో తడవద్దన్నానా? నా మాట ఏది విన్నావ్?' వినపడీ వినపడనట్టు గొణుక్కున్నాడు. పైకి పెదవి విప్పకుండా అలా భయం నటించడం ఆమెనెందుకో ముచ్చటేసింది.

అయినా ఆమె తన ప్రవర్తన కనబడనీయకుండా బెడ్‌షీట్ కప్పుకుని పరుపు మీద చేరగిలబడింది. కళ్ళు మూసుకుంది.

తల మీద... నుదిటి మీద... రెండు కళ్ళ మీద... చెవుల మీద.... పెదవి మీద... కంఠం మీద... గుండె మీద... పొట్ట మీద.... పాకిన ముద్దులు అరిపాదాలనూ వదల్లేదు. అదే బెడ్‌షీట్ కిందకు చేరాడతను.

ఆమె పక్కకు ఒత్తిగిల్లింది.

వెన్నును వదలని పెదవుల చప్పుడు...

ఆమె రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నరాల తీగలు మీటే వేళ్ళని స్వాగతం పలుకుతున్నట్టు శరీరం విచ్చుకుంది. చల్లబడిన దేహం వేడెక్కింది. కప్పుకున్న బట్ట బదులుగా అతడు..

చిరు చెమటల మధ్య అలసిపోతూ అతడన్నాడు....

"మరుజన్మకా దేవుడు వరమిస్తే, ఈ జన్మకు మరణిద్దాం..."

ఆమె కౌగిలింత కొంత సడలడం అతను గమనించలేదు.

"కలిసి బతికాం.. కలిసి చచ్చిపోతాం... చచ్చిపోతున్నాం....."

ఆమె చేతులు శక్తి లేనట్టు వేళ్ళాడిపోయాయి. అంతవరకూ అందని ఆకాశాన్ని అందుకోవాలని లేచిన కెరటం విరిగిపోయింది. ఒడ్డు అందలేదు.

అతడికి మాత్రం ఒడ్డేదో దొరికింది, అలసి తృప్తిగా ఆమె మీంచి లేచాడు. పక్కనే చతికిలబడ్డాడు. ఆమె పొట్ట మీద తలపెట్టి అన్నాడు.....

"నీలాంటి భార్య దొరకడం నా అదృష్టం"

శరీరం మొద్దుబారినట్టు ఆమె కదలకుండా అలాగే వుంది.

"నా కంటే చిన్నదానివైనా పెద్ద మనసుతో నా చావులో కూడా తోడై వుంటున్నావ్...."

ఆమె మెదడూ మొద్దుబారింది.

"ఏదైనా చెప్పు" అతడామెను కుదిపాడు. ఆమె చలనం లేనట్లే పడి వుంది.

అతడు లేచి ఆమె తల నిమిరి, టేబుల్ దగ్గరికి వెళ్ళి కాగితం తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె కళ్ళు తెరిచి అతన్ని చూసింది.

"సంతకం పెట్టు" పెన్నందించాడు, టూర్ డైరీ ఒత్తుగా పెట్టాడు.

ఆమె ఏమిటన్నట్టుగా కళ్ళతోనే ప్రశ్నించింది.

"నేను సంతకం పెట్టేసాను. మన చావుకెవరూ బాధ్యులు కారని..."

అతడు జిప్ బేగ్ తెరచి దోసిళ్ళ నిండా గన్నేరు కాయలు తెచ్చాడు. నేలమీద పోసి పేపర్ వెయిట్‌తో చితగ్గొడుతున్నాడు. ఆ చప్పుడు గడియారం ముళ్ళ చప్పుడిని వినపడకుండా చేస్తోంది.

ఆమె దిగ్గున లేచి కూర్చుంది.

అతడామెను గమనించకుండా, తన పని తాను చేసుకుపోతున్నాడు.

ఆమె చుట్టూ చూసింది. గది గొళ్ళాలకు బోల్టు వేసి వుంది. ఖైదులా వుంది.

పారిపోవాలనిపించింది, భయంతో ఆమెకు కాళ్ళూ చేతులాడలేదు. దుఃఖం ఉప్పెనై పొంగిపోయి కన్నీళ్ళ గండి పడక మనిషి అతలాకుతలమవుతూంది.

పచ్చటి గన్నేరుకాయల ముద్దని రెండు పెద్ద వుండల్లా చుట్టి పేపరులో పెట్టుకొని వచ్చి ఆమె పక్కనే కూర్చున్నాడు.

"ఇంకా సంతకం పెట్టలేదా?"

చేతిలో వున్న ముద్దలని పక్కనే పెట్టి, ధైర్యాన్నిస్తున్నట్టుగా ఆమె నుదుటి మీద మళ్ళీ ముద్దు పెట్టాడు. ఆమె చేతికి మళ్ళీ పెన్నందించాడు.

ఆమె చేతిలోని లెటరు వంక చూడలేదు. అతని కళ్ళలోకి చూసింది. అప్పటికి ఆమె కళ్ళకి గండి పడింది. వెక్కి వెక్కి ఏడ్చింది. అతడు ఆమె రెండు భుజాలనూ ఎత్తి అనునయించే ప్రయత్నం చేసాడు. కన్నీళ్ళను తుడిచాడు. ముక్కుకూడా తుడిచాడు. జారిన పైటని సర్దాడు.

"నవ్వాలి..."

"నవ్వుతూ పోవాలి..."

చాలాసేపటికి ఆమె మామూలు కాగలిగింది.

"ఎందుకలా ఇదవుతావ్? నేను లేనూ... కాకిలా కడల్లా బతికే కన్నా హంసలా ఆర్నెల్లు బతకమన్నారు. ఈ అప్పులతో ... అభాసుపాలతో బతుకుతూ చచ్చేకన్నా ఒక్కసారి చావడం మేలు. అప్పుల వాళ్ళ , అయినవాళ్ళ చేతుల్లో చావడం కన్నా మనకి మనమే చావడం మేలు. మనకింకా పిల్లలు లేకపోవడం అదృష్టవంతులం. లేకపోతే వాళ్ళని చంపి మనం చావవలసి వచ్చేది... ఇలాంటివి రోజూ ఎన్ని చూడ్డం లేదు. కాకపోతే అనుభవంలోకివచ్చినప్పుడు దిగమింగుకోవడం కష్టమే..."

అతడు ఆరిపోయిన ఆమె కన్నీళ్ళను తుడవడం మానలేదు.

"... నీది చిన్నపిల్లల తత్వం. జీవితాన్ని నవ్వుతూ తీసుకుంటావ్, అందుకే నీకివన్నీ అర్థం కావు. భర్తగా కాకపోయినా నీకంటె పెద్దవాడిగా నాకు గౌరవమిచ్చినందుకు.... మన్నించి ఆఖరు నిముషంలో తోడున్నందుకు కృతజ్ఞుడిని..."

అతని గొంతు బొంగురుబోయింది. కళ్ళలో నీళ్ళూరాయి.

ఆమె ఆ లెటర్ అడుగున అతని సంతకం కింద సంతకం చేసింది. చేసాక చదువుకుంది.

"మేమిద్దరం బతుకుపై విరక్తిచెంది చావాలని ఒక నిర్ణయానికి వచ్చాం. మా ఆత్మ హత్యల వెనుక ఎవరి ప్రభావమూ లేదు, బలవంతం అంతకన్నా లేదు. ఇందుకు ఎవరి సంబంధమూ లేదు. మేమిద్దరం కలిసి ఈ పనికి పూనుకున్నందుకు ఆదర్శ దంపతుల్లా జీవించి మరణిస్తున్నందుకు ఆనందంగా వుంది..."

ఇట్లు

అని ఇద్దరి సంతకాలు.

అతడామె చేతికి ఒక గన్నేరు ముద్ద అందించాడు. తనొక ముద్దని తీసుకున్నాడు. మరో చేత్తో ఆమె చేతిలోని లెటరూ, పెన్నూ తీసి తలగడ కింద ఎగరకుండా - కనిపించేటట్టు పెట్టాడు.

కొద్ది క్షణాలు దొర్లాయి.

సమయం అర్ధరాత్రి కావడం వల్ల నిశ్శబ్దం క్షణాల్ని పెంచుతోంది.

అతడు తినమన్నట్టుగా చూసాడు. తల ఆడించాడు.

ఆమె కదలక మెదలక అలానే వుంది.

అతడు 'ఆ' అని శబ్దం చేస్తూ నోరు తెరిచాడు. తినిపించమన్నట్టుగా చూసాడు.

ఆమె అతడు కోరినట్టుగా ముద్దని నోటికి అందించలేకపోయింది. తనే ముందుకు వంగి ఆమె చేతిలోని ముద్దని అందుకున్నాడు. పట్టని నోటితో ఆ ముద్దని ముమ్మారు చేసి అందుకున్నాడు. కళ్ళు మూసుకు మింగాడు. ఆమె భయంతో మొదట కళ్లు మూసుకున్నా తరువాత జరిగేది చూస్తూ కొయ్యబారి కన్నార్పలేదు.

అతడు ఆ ముద్దని తిన్నాక మరో ముద్దని ఆమె నోటికి అందించాడు. ఆమె కాదనలేకపోయింది. మొదట కొంచెం మింగింది. మళ్ళీ కొంచెం మింగుతుంటే వాంతి వచ్చినట్లయింది. అయినా బలవంతంగా మింగింది. మిగిలినది నోట్లోకి తీసుకొని వుమ్మేసింది. ఏదో అసహించినట్టు... అప్పటికి చలనమొచ్చినట్టు అరుస్తూ తలుపుదాకా వెళ్ళింది. బోల్టు తీసిందే కాని అడుగు వెయ్యలేక పడిపోయింది. సోలిపోతున్న కళ్ళతో లేచి బెల్ నొక్కింది.

'బతకాలి' అనుకుందే కాని ఆమెకి తెలివి తప్పుతోంది.

అతడిలో ఏ శ్వాసా లేదు.

కాస్సేపటికి జనం ఇద్దర్నీ ఆసుపత్రికి మోసుకుపోవడం ఆమెకు గుర్తుంది.

ఇద్దరూ పోయారంటున్నారెవరో....

"బతకలేక దంపతుల ఆత్మహత్య" శీర్షికన వార్తల కథనం ప్రారంభమయ్యింది.

★ ★ ★

*ప్రచురణ : ఆంధ్ర జ్యోతి సచిత్రవారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక.*
*రచనా కాలం : ఆగస్టు '97*